**ఆర్థిక విలువలు మానవ సంబంధాలను శాసించే స్థాయికి చేరుకుంటున్నాయి. కానీ, డబ్బు మనిషిని మానసిక వేదన నుంచి విముక్తం చేయగలదా?**

# పాతకాలపు మనిషి

డాక్టరు దగ్గిర్నుంచి తిరిగొచ్చాక అప్పటిదాకా అయిన ఖర్చు లెక్కేసుకున్నాడు తిలక్. ఎనిమిదివందల ఎనభై. అంటే, భార్య చేతికొచ్చేదాంట్లో సగం. ఇవి కాకుండా ఇంకా అదనం ఖర్చులు. నెల మధ్యలో కూడా కొనాల్సివచ్చే మందులు కలిపి మరో ఇంత ఉంటాయి.

ఇలాంటప్పుడే కరిగిపోయిన ఆస్తులూ, గతవైభవాలూ గుర్తొస్తాయి. రోజులు సాఫీగా సాగిపోయి నన్నాళ్ళూ మనిషి మెడ గతం వైపుకి తిరగదు.

తిలక్ తండ్రి పాతకాలం మనిషి. ఆమాట తిలకే అనుకుంటాడు. పైకనడానికి కూడా ఏమాత్రం సంకోచించడు. వల్లమాలిన బంధుప్రీతితో ఆస్తంతా కర్పూరంలా కరిగించేశాడని అతని అభిప్రాయం.

ఆయనకి ముగ్గురక్కచెల్లెళ్ళు. అక్కగారికి, అంటే తిలక్ పెద్ద మేనత్తకి చిన్నప్పుడే పెళ్ళవడం, ఆ వెంటనే భర్త చనిపోవడం జరిగింది. ఆవిడ తమ్ముడింట్లోనే ఉండేది. మిగిలినవాళ్ళిద్దరూ ఆయన తరవాతి వాళ్ళు స్థితిమంతులు కాదు. అడపా దడపా అన్నగారి సహాయం కోరుతుండేవారు. వాళ్ళకి పిల్లలు. ఆ పిల్లల చదువులకి ఈయన తనకి తోచింది ఇచ్చేవాడు. వీళ్ళంతా కాకుండా విధవ మేనత్త ఒకావిడుండేది. తండ్రి మేనత్త. ఎక్కడో తండ్రి తండ్రికి చెల్లెలు. ఆవిడ తల చెడడం, తమ దగ్గిరుండడం!

తండ్రికెలా చెప్పాలో, ఈ అనవసరపు బాదరబందీలన్నీ ఎలా తప్పించాలో అర్థమవక సతమతమయ్యేవాడు తిలక్. ఇంతమంది మధ్య అతనికి పెద్ద గారాబమేమీ జరిగేది కాదు. మూడు పూటలా కడుపుకింత తినడమే గొప్పగా ఉండేది.

ఎన్నో సర్దుబాట్లుండేవి. పెద్దపిల్లలకి కుట్టించిన బట్టలు ఆ కుటుంబంలో చిన్నపిల్లలదాకా వరుస క్రమంలో వచ్చేవి. అలాగే పుస్తకాలూను. ఇప్పటన్ని ప్రైవేటు స్కూళ్ళు లేవు. విద్యారంగం ఇంత ఎత్తుని ప్రైవేటీకరణ చేయబడలేదు. గవర్నమెంట్ స్కూళ్ళే గాబట్టి దాదాపుగా అవే పుస్తకాలు చేతులు మారేవి. ఎప్పుడైనా పుస్తకం మారితే కొత్త పుస్తకం కొనేవాడు తిలక్ తండ్రి. అలాంటిది తిలక్ వంతులో ఎప్పుడూ రాలేదు.

కాళ్ళకి చెప్పులుండేవి కాదు. చేతికి వాచీ ఉండేది కాదు. క్రికెట్టూ, కేరమ్సూ తెలీవు. కోతికొమ్మచ్చి, బిళ్ళంగోడు, కబాడీ - ఇవే ఆటలు. ఇవిగాక ఆడపిల్లల్తో కలిసి గచ్చకాయలు, చింతపిక్కలు, తొక్కుడు బిళ్ళలూ ఆడేవాడు తిలక్ కొంత వయసొచ్చేదాకా.

'ఛీ ఛీ! ఏం జీవితమది' అనిపిస్తుందతనికి ఇప్పుడారోజులు గుర్తొస్తే.

తిలక్ ఇంట్లోవాళ్ళతో కలవకుండా ఒకింత పెడగా ఉండేవాడు. తనకి సంబంధించిన విషయాల్లో నిర్ణయాలు తానే తీసుకునేవాడు. అవి చిన్నచిన్నవే గాబట్టి ఇంట్లోవాళ్ళకి అభ్యంతరం ఉండేది కాదు. కానీ, పెళ్ళి దగ్గిర కూడా అతనా స్వతంత్రం అలాగే నిలబెట్టుకోవడంతో గొడవైంది. మాటపట్టింపులూ, పంతాలూ వచ్చాయి. పెద్దవాళ్ళ మనసులకి గాయాలయ్యాయి. అయినా, అతను చలించలేదు.

రెండో మేనత్త కూతుర్ని తిలక్కి ఇచ్చి చెయ్యాలని ఇంట్లో ప్రతిపాదన.

"నేను ఉద్యోగస్తురాలైన అమ్మాయినే చేసుకుంటాను" అని అతను ప్రకటించాడు. దానికి అనేకమైన కారణాలున్నాయి. ఇంట్లో ఇంట్లో ముడిపెట్టుకుంటే కట్నం అంటూ ఏమీ రాదు. చిన్నత్తా వాళ్ళదీ లేని కుటుంబమే కావచ్చు కానీ, వాళ్ళ లేమికి తాను బాధ్యత వహించాలా? తన పాటి ఉద్యోగం ఉన్న వాళ్ళు బయట వేలకి వేలు కట్నం తీసుకుంటున్నారు. తానూ తీసుకోవచ్చు. కట్నం తీసుకుని బయటి సంబంధం చేసుకున్నంతమాత్రాన తన స్టేటస్‌లో మార్పేమీ రాదు. భార్య ఉద్యోగం మిష మీద ఈ ఇంటి తోటీ, ఊరి తోటీ సంబంధాలన్నీ తెంచేసుకోవాలి. ఈ మాటల్ని తిలక్ బయటికనలేదు.

"అదేమిట్రా? చిన్నప్పట్నుంచీ అనుకుంటున్న మేనరికం ఉండగా బైటి సంబంధం చేసుకోవడమేమిటి?" తల్లి తెల్లబోతూ అడిగింది.

"మేనరికం అనుకున్నారా? ఎవరనుకున్నారు? మీరనుకున్నారేమోగానీ నేనెప్పుడూ అనుకోలేదు." కొట్టినట్టే జవాబిచ్చాడు తిలక్.

"ఔనోయ్! మేమే అనుకున్నాం. ఏం, మా మాటకంత విలువలేకుండా పోయిందా? కనేటప్పుడు నిన్నడిగి కన్నామా, ఇందులో మాత్రం నిన్నడగడానికి?" దెబ్బతిన్న ఆత్మాభిమానంతో అడిగాడు తండ్రి.

"నన్నడిగుంటే కనద్దని చెప్పేవాణ్ణి."

ఇంకెప్పుడూ ఆవిడ తన బాధని బైటికనలేదు. ఆ మరుసటేడే ఆవిడ దేవుడి పిలువందుకుంది.

ఈ లోగానే తిలక్ పెళ్ళయింది. కట్నం దగ్గర అతనే మాత్రం తగ్గలేదు. తండ్రివల్ల కాదని ముందుగానే తెలుసుకాబట్టి మధ్యవర్తిని పెట్టుకుని అన్నీ ఖరాఖండీగా మాట్లాడుకున్నాడు. ఈ బేరసారాలవీ చూసి తిలక్ తండ్రికి మనసు చెదిరి ఏదో తప్పు చేస్తున్న భావనతో తల దించుకున్నాడు.

పిల్ల పేరు భారతి. పెళ్ళి జరుగుతున్నంతసేపూ పెళ్ళికూతురి మొహంలో ఎలాంటి కళాకాంతీ కనిపించలేదాయనకి. పాపం! తండ్రి ఇస్తున్న కట్నం గురించే దిగులు పడ్తోందేమో! ఆయన విలవిల్లాడాడు.

వాళ్ళు బట్టలవీ పెడ్తుంటే చేతులు చాచి భిక్ష తీసుకుంటున్నట్టు అనిపించింది. ఇలాంటివేం తిలక్కి లేవు గాబట్టి నవ్వుతూ తుళ్ళుతూ తిరిగాడు.

కట్నం బాపతు నలభై అయిదువేలూ చేతిలో పడ్డాక తిలక్ మొదటిసారిగా తాను సుఖపడే మార్గాల గురించి ఆలోచించాడు. అంటే ఇంతకాలం అతను సుఖాన్ని గురించి ఆలోచించలేదని కాదు. అవన్నీ పేకమేడలు. వట్టి ఊహాసౌధాలు. పగటి కలల్లో మాత్రమే కట్టుకునేవి. ఇప్పటి ఆలోచనలు అతని వాస్తవసుఖాలకి దారితీసేవి.

"ఏరా, అంత తీసిపోయిందా మా కడుపుని పుట్టడం? పెద్దంతరం, చిన్నంతరం లేకుండా మట్లాడుతున్నావు?" తల్లి బాధపడింది.

"అంత గొప్పగా పెంచారామ్మా నన్ను? గుర్తు చేసుకుని చెప్పు. ఎన్ని కొత్త బట్టలు కుట్టించారు నాకు? కొత్త పుస్తకాలెప్పుడైనా కొన్నారా? కోరుకున్న తిండి... చదువు... ఏది అమరింది నాకు? నా కన్నా తక్కువ మార్కులొచ్చేవి చక్రధర్‌కి... వాడిప్పుడు డాక్టరు. తెల్లకోటేసుకుని నా కళ్ళముందే బోర్డు కట్టాడు..." తిలక్ బరస్టయ్యాడు.

"వాళ్ళతో మనకి సాపత్యమా? వాళ్ళకి తగలేసినంత ఆస్తుంది. ఖర్చుపెట్టి చదివించారు."

"ఎక్కడిదమ్మా వాళ్ళకంత ఆస్తి? అక్కర్లేని బాధ్యతలూ, అనవసరపు ఖర్చులూ తగ్గించుకుంటే మీరు నన్ను మాత్రం చదివించలేకపోయేవారా" అనేసి విసురుగా వెళ్ళిపోయాడు.

ఆ మాటలు ఎక్కడ తగలాలో అక్కడ తగిలాయి.

"చిన్నవాడైనా తిలక్ చెప్పింది నిజం తమ్ముడూ. మా బరువెత్తుకుని వాడికి అన్యాయం చేశావు." తిలక్ పెద్దమేనత్త కళ్ళొత్తుకుంటూ చెప్పింది.

వాడి మాటలు మీరేం పట్టించుకోకండి వదినా! తల్లీ, తోడూ అన్నాక బాధ్యతలుండవా? అయినా, మీకు మేమేం పెట్టేమని? తోటివాడు డాక్టరయ్యాడు కదూ, అదీ బాధ! దాచుకోలేక బైటికి వెళ్ళగక్కాడు." తిలక్ తల్లి బతిమాలింది.

ఆవిడ మాటలకి సాంత్వన కలగలేదు పెద్దావిడకి. "నాలుగు రోజులు చిట్టి దగ్గిరుండి వస్తాను. ఈ బతుకెలా తెల్లవారుతుందో ఏమిటో" అంటూ పెద్ద చెల్లెలి దగ్గరికి ప్రయాణమైంది. చూస్తూ కూడా ఏమీ అనలేకపోయాడు తిలక్ తండ్రి.

"నీకు ఒంట్లో శక్తుంది. వెళ్ళిపోతున్నావు. నేనెక్కడికి వెళ్ళనే" అని ఏడ్చింది ఆయన మేనత్త. ఆవిడ చేతుల్ని తన తడికళ్ళ మీద ఉంచుకున్నాడు తిలక్ తండ్రి.


సుఖం! తిలక్‌కి కొన్ని సుఖాలు తెలుసు. చాలా చిన్నప్పుడు - వేడి వేడి అన్నంలో పిసరంత పాత చింతకాయ పచ్చడి కలిపి చెయ్యి తడిసేలా నెయ్యి పోసి, నోట్లో ముద్దలు కలిపి తల్లి పెడ్తుంటే జిహ్వకి చాలా సుఖం తోచేది.

కాస్త పెద్దయ్యాక తండ్రి కుట్టించిన కొత్త చొక్కా వేసుకుని స్కూలుకెళ్ళినప్పుడు పిల్లలందర్లో గొప్పగా తోచి మనసుకి సుఖమనిపించేది.

తల్లి తాను చేసిన ఏ తాయిలమో మరొక్క పిసరు మిగిల్చి చాటుగా చేతికిస్తే, అది తింటుంటే అమరసుఖం దొరికేది.

కానీ, వీటినెవరూ సుఖాలని ఒప్పుకోరు. రోజూ పంచ భక్ష్య పరమాన్నాలు తినే వాడికి పాతచింతకాయ పచ్చడి రుచించదు. నిత్యం పట్టుబట్టలు కట్టుకునేవాడి సుఖంలో ఒక కొత్త చొక్కా తెచ్చే మార్పేం ఉండదు. కడుపు నిండినవాడికి చాటుగా తినడంలో నీతి కనిపించదు. తనకవేవీ లేవు గాబట్టి సుఖాలనుకుంటున్నాడు. తనకి లభించినవి అంతమాత్రమే గాబట్టి అవే సుఖాన్నిచ్చాయి.

ఆ క్షణాన్నించే తిలక్ ప్లాన్డ్‌గా ఆలోచించడం మొదలుపెట్టాడు. మూడేళ్ళ దాకా పిల్లలొద్దనుకున్నాడు. అలాగే భార్యని డాక్టరు దగ్గరకి తీసికెళ్ళి లూపు వేయించాడు. ఈ మూడేళ్ళలో ఇంట్లోకి కావలసినవన్నీ కొన్నాడు. అన్నీ అంటే,



కలర్ టీవీ, ఫ్రిజ్, కూలర్ - ఇత్యాది సమస్తం.

ఆ తర్వాతే భారతికి నెల తప్పింది.

"ఒక్కరు చాలు మనకి. ఆడేనా, మగేనా సరే! ఏం" అన్నాడు ఆమెతో.

ఆమె దిగ్గున తలెత్తి చూసింది. తనకి అతి చేరువలో ఉన్నా ఏమీ అర్థం కాని మనిషి తిలక్. అతని కళ్ళలోకి లోతుగా చూసింది. అవి తేజోహీనంగా అనిపించాయి. అభావంగా ఉన్నాయి.

"ఏమిటాలోచన." అడిగాడు తిలక్.

మరీ ఒక్కర్తే ఏంటి? కనీసం ఇద్దరు పిల్లలేనా ఉండాలి" అంది నచ్చజెప్తూ. అతనిలో తెచ్చిపెట్టుకున్న సౌమ్యం ఎగిరిపోయింది.

"దేనికిద్దరు? మనకేం ఆస్తులున్నాయని? చాలీచాలకుండా వాళ్ళని పెంచుకొచ్చి గుమాస్తాగిర్లు వెలగబెట్టమని దేశం మీదికి వదుల్దామా? బుర్ర తక్కువ ఆలోచనలూ, బుర్ర తక్కువ మనుషులూ!" అని విసురుగా లేచి వెళ్ళిపోయాడు.

చిత్రాలు: నర్సిం

భారతి ఏడ్చింది. నిరసనవ్రతం చేసింది. అయినా, తిలక్ తనమాటే నెగ్గించుకున్నాడు.

తిలక్‌కు ఇప్పుడు ఒక్కడే కొడుకు. అతని ఆశలన్నిటికీ ఆయువుపట్టు వాడే. తనేవైతే మిస్ చేశాననుకున్నాడో అవన్నీ కొడుక్కి అమర్చాడు తిలక్. బిర్లా, టాటాల లెవెల్లో వాడిని పెంచక పోవచ్చుగానీ, వాడికి జరిగినంత ముద్దు వాళ్ళకు జరిగివుండదన్నది మాత్రం నిస్సంశయం.

పిల్లాడి నాలుగోయేటదాకా అన్నీ సవ్యంగానే జరిగాయి. తల్లీ, తండ్రీ ఆఫీసుకెళ్ళేవారు. వేలమీద ఆర్జించి తెచ్చేవారు. వాళ్ళు ఆఫీసుకి వెళ్ళినప్పుడు తాతాబామ్మలు చూసుకునేవారు. స్కూల్లో వేశారు. తెల్లగా, బొద్దుగా ఉండేవాడేమో అక్కడంతా ముద్దు చేసేవారు.

కాళ్ళకి షూస్, యూనిఫామ్‌తో మడత నలగని పుస్తకాలని బేగ్‌లో పెట్టుకుని వాడు స్కూల్‌కెళ్తుంటే తిలక్‌కి మనసు పరవశించిపోయేది. వాడిని దించడానికి తాను స్కూటర్ కొనుక్కున్నాడు. కానైతే వాడినడిగి తాను కనలేదనీ, తన అభిరుచులమేరకే వాణ్ణి పెంచుతున్నాడనీ ఎప్పుడూ తిలక్కి అనిపించలేదు.

నాలుగోయేడు నిండుతుంటే బాబులో అనూహ్యమైన మార్పు వచ్చింది. స్కూలుకెళ్ళనని మొరాయించడం, మన్నుతిన్న పాములా స్తబ్ధుగా ఉండడం, అస్తమానూ నిద్రపోవడం, ఆపైన వెర్రి తిండి...

డాక్టర్ల చుట్టూ తిరిగే అధ్యాయం మొదలైంది.

* * *

"ఏమన్నాడురా డాక్టరు?" తల్లి ఆత్రతగా అడగడంతో తిలక్ ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

"ఏమీ చెప్పడం లేదు. ఆ టెస్టులు చేయించండి, ఈ టెస్టులు చేయించండంటాడు." బాధగా జవాబిచ్చాడు.

"బంతిలాంటి పిల్లాడు. చలాకీగా తిరుగుతూ ఒక్కపనీ తోచనిచ్చేవాడు కాదు... లేకపోతే వేరే డాక్టరుకి చూపించరా." ఆవిడ కళ్ళొత్తుకుని అంది.

"అదే ఆలోచిస్తున్నాను." సాలోచనగా చెప్పాడతను.

భారతి భర్తతో ఎక్కువగా మాట్లాడదు. అతన్ని కదిపి, తన మనసు నొప్పించేలా చేసుకోవడం కన్నా

**రెండో మేనత్త కూతుర్ని తిలక్కి ఇచ్చి చెయ్యాలని ఇంట్లో ప్రతిపాదన. "నేను ఉద్యోగస్థురాలైన అమ్మాయినే చేసుకుంటాను" అని అతను ప్రకటించాడు.**

మౌనమే శ్రేష్ఠమని చాలా తొందరగా గ్రహించిందామె. కానీ, అతన్తో సంప్రతించక తప్పని విషయాలూ ఉంటాయి. కొడుకు గురించి అతన్తో కాక ఇంకెవర్తో మాట్లాడుతుంది? వాడికేమైంది. పిచ్చా? మానసికంగా ఎదగడం లేదా? ఎందుకిలా జరిగింది? తానే పాపం చేసుకుంది?

"బాబుని బొంబాయి తీసుకెళ్దాం. అక్కడ మంచి డాక్టరున్నాడట. నా ఫ్రెండొకతను చెప్పాడు." తిలక్ ఆశగా చెప్పాడు.

"బాబుకి పిచ్చా?" భారతి ప్రశ్న వాడిగా వచ్చి తాకింది.

"ఛ...ఛ... కాదు."

"మరేమిటి వాడికి? మీరు నాకెందుకు చెప్పరు? నాకు చెప్పాల్సిన అవసరం లేదని అనుకుంటున్నారా? అసలే విషయంలోనేనా నా మాట విన్నారా? వాడికేమిటసలు? అందరు పిల్లల్లా ఎందుకుండడు?" ఉద్రేకంగా అడిగింది.

"డిప్రెషనట."

"అంటే?"

"పిచ్చి మాత్రం కాదు."

"మీరు నాదగ్గర దాస్తున్నారు."


"కాదన్నానా?" విసుక్కున్నాడతను.

ఆమె కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

ఆ రోజు ఇంట్లో వంట లేదు. నిండింట అభోజనం ఉండరాదని తిలక్ తల్లికి మనసు పీకుతూనే ఉంది. కానీ, నా కొడుక్కిలా ఉండి మేం ఏడుస్తుంటే వంటెందుకు చేశావని అతననేస్తాడని ఆవిడకి భయం. ఏం చెయ్యకుండా కూర్చుంది.

అపార్థాలు. దారుణమైన అపార్థాలు. భార్యాభర్తలకి మధ్య, తల్లీకొడుకులకి మధ్య.

రాత్రి తాను బొంబాయి వెళ్ళే విషయాన్ని తండ్రితో ప్రస్తావించాడు.



**కొడుకు తన తెలివితక్కువతనం, అనుభవరాహిత్యాల వల్ల ఊబి లోకి కూరుకుపోతుంటే తండ్రి చేయూతనిచ్చి పైకి లాగుతున్న దృశ్యం రూపుదిద్దుకుంది.**

"బాబుని బొంబాయి తీసికెళ్ళి చూపించాలను కుంటున్నాను. రెండేళ్ళయింది. డాక్టర్ల చుట్టూ తిరగడం మొదలుపెట్టి. ఏ ప్రయోజనమూ కనిపించడంలేదు. వాణ్ణి సంతోషంగా ఉంచమంటారు. ఏమిటి సంతోషమంటే? ఎన్ని బొమ్మలు కొన్నాను? వీటి ఖర్చు వీటిదే అవుతోంది. మందుల ఖర్చు మందులదే అవుతోంది." ఆవేదన వ్యక్తమైందతని మాటల్లో.

తిలక్ తండ్రి తాత్వికంగా నవ్వాడు. ఆ నవ్వు జీవితాన్ని కాచి వడబోసిన అనుభవాలని ప్రతిధ్వనిస్తోన్నా, వాటిని తిలక్ వినలేకపోయాడు. అవతనికిప్పుడే వినిపించవు కూడా.

"భారతీ, నేనూ సెలవు పెట్టి వెళ్తున్నాం. డబ్బు బాగా ఖర్చవుతుంది. జీతాలుండవు కూడా. అందుకే పొలం బేరం పెట్టాలనుకుంటున్నాను" అన్నాడు.

తండ్రి కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. ఆ పొలం పిత్రార్జితం. తనతో సమానంగా అందులో కొడుక్కీ హక్కుంది. అమ్మద్దంటే వాటా కోసం కోర్టుకెక్కుతాడు కూడా. మంచి చెప్పినా వినే పరిస్థితిలో లేడు. ఇక్కడి సమస్య పొలం అమ్మాలా వద్దా అనేది కాదు. పదెకరాల పొలం తనపేర్న ఉన్నప్పుడే కొడుక్కి తాను భారంగా అనిపిస్తున్నాడు. ఆ పొలం కాస్తా అమ్మేశాక తన యొక్క నిజమైన భారాన్ని అతను మోస్తాడాని.

ఎటూ తాను అంగీకరించినా, అంగీకరించకపోయినా పర్యవసానం గృహచ్ఛిద్రాలే. అంగీకరిస్తే అవి బయటపడడానికి కొంత సమయం పడ్తుంది. లేకపోతే ఈ క్షణాన్నే వస్తాయి. దాని ప్రభావం పసివాడిమీద ఎక్కువగా ఉండచ్చు.

ఆ కొద్దిసేపట్లోనూ ఆయన పరిస్థితిని అవలోకించుకున్నాడు. రేపెప్పుడో రాబోయే రోజుకి అన్వయించుకున్నాడు. అన్నీ తేటతెల్లమయ్యాయి. వెంటనే సరేననలేకపోయాడు. మనసు పీకింది. తాతల నాటి ఆస్తనే సెంటిమెంట్ వెనక్కి లాగింది. తాను చెప్పదలుచుకున్నది చెప్పేశాక ఎక్కువసేపు ఉండలేదు తిలక్. ఆయన అభిప్రాయం కూడా వినలేదు.

పెద్దాయన అశాంతిగా మంచం మీద ఒరిగాడు. పక్క మంచం మీద భార్య నిద్రపోతోంది. తానున్నాడన్న నిశ్చింతతో ఏ ఆలోచనా లేకుండా నిశ్చింతగా ఉంది. పొలం అమ్మేశాక ఈ నిశ్చింత ఎంతకాలం ఉంటుంది? రెక్కల కష్టంతో ఆమెని పోషించాలేమో! అప్పుడింక ఇద్దరికీ మిగిలేవి కన్నీళ్ళే. ఆలోచిస్తున్నకొద్దీ బాధనిపిస్తుంటే ఇంక ఆలోచించడం మాని బాధని దూరం చేసుకునే ప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాడు.

కోడలొచ్చి టేబుల్ మీద నాలుగరటిపళ్ళు, గ్లాసుతో పాలూ తెచ్చిపెట్టింది. ఆఖరిగా మరచెంబుతో మంచినీళ్ళు పెట్టి, దానికింద ఒక చీటీ ఉంచింది. దాన్ని చూసి ఆయన గమ్మున లేచాడు. మడతలిప్పి గబ గబ చదివాడు.

"పొలం అమ్మకానికి మీరొప్పుకోకండి. దానివల్ల ప్రయోజనం ఉండగలదన్న ఆశ నాకే మాత్రం లేదు. అమ్మిన తదుపరి పరిణామాలెలా ఉంటాయో నేను ఊహించగలను. ఓ వైపుని కన్నకొడుకిలా ఉండగా, కన్నవాళ్ళలాంటి మిమ్మల్ని కూడా దూరం చేసుకుని ఎడారి బతుకుని ఓ అపరిచిత బాటసారితో గడపలేను. పెళ్ళయి ఇన్నేళ్ళైనా మీ అబ్బాయి నాకు బొత్తిగా అర్థం కాలేదు."

భారతి చాలా ఉద్వేగంతో రాసినట్టుంది. తిలక్ ఇంట్లోనే ఉన్నాడు. మామగారితో ఈ విషయం మాట్లాడ్డం అతనున్నప్పుడు కుదరదు. అతను గానీ వింటే గొడవవుతుంది. అందుకే కాగితం మీద పెట్టింది. కాలిన గాయానికి నవనీతం పూసినంత చల్లగా అనిపించింది తిలక్ తండ్రికి. గుండెల మీద బరువంతా తీసేసినట్లయి తేలిక పడి, కంటిమీదికి కునుకు కూడా వచ్చింది.


మర్నాడు ఆయన లేచేసరికి తిలక్ స్టాంపు కాగితాల్తో సిద్ధంగా ఉన్నాడు. వాటిని ఆయనకిచ్చి సంతకాలు చెయ్యమన్నాడు. ఆయన తటపటాయించకుండా చేసేశాడు. కాఫీ ఇవ్వడానికి అక్కడికొచ్చిన భారతి నిశ్చేష్టురాలైపోయింది.

"ఒక్క విషయం చెప్తాను, వింటావా తిలక్?" కొడుకు నడిగాడు.

తిలక్‌కి ఆయన పట్ల ఒకవిధమైన జాలి పొటమరించింది. పొలం అమ్మడానికి ఆయన ప్రతిఘటిస్తాడని భావించి అప్పుడు తానేం చెయ్యాలో రంగాన్ని సిద్ధం చేసుకున్నాడు. అలాంటిదేమీ జరగలేదు. ఎన్నో ఆస్తులు కరిగిపోగా మిగిలిన ఈ చివరిది అమ్మడానికి కూడా ఆయనేమాత్రం సంకోచించలేదు. అది ఈ ఇంట్లో ఆయన ఉనికినీ, తన దగ్గర ఉండడానికి ఆయనకి గల హక్కునీ సవాలు చేసేదే అయినప్పటికీ వెనుకంజ వెయ్యలేదు. ఏంచేత? తనమీదున్న నమ్మకమా? మనుమడి మీదున్న ప్రేమా? రెండింట్లో ఏదో ఇదమిత్థంగా తేల్చుకోలేక మరోసారనుకున్నాడు - బొత్తిగా పాతకాలం మనిషని. ఇందాకటి జాలి స్థానంలో ఒకింత ప్రేమ పుట్టింది. వెళ్ళి పక్కలో కూర్చున్నాడు.

"చెప్పండి" అన్నాడు.

"ఇప్పుడు నువ్వమ్మబోతున్న చెక్క వందేళ్ళనాడు మన కుటుంబంలోకి ప్రవేశించింది. అంటే నీ తండ్రి కన్నా, నా తండ్రి కన్నా ముందు తరానికి చెందినది."



"అమ్ముతున్నందుకు బాధపడ్తున్నారా?"

"నువ్వే అన్నీ ఊహించుకోకు. నన్ను కూడా చెప్పనీ. ఇన్నేళ్ళుగా మన కడుపుల్ని నింపింది. మనని ఆశ్రయించిన వారికి కూడా ఇంతన్నం పెట్టింది. ఇప్పుడున్నవి గడ్డురోజులు. రాబోయేవి మరీ గడ్డురోజులు."

"మనం అయిదుగురం. ఇద్దరం తెచ్చుకుంటున్నాం. ఆపాటి తినలేమా?"

"తినలేమని కాదు నేననేది."

"మరేమిటి మీరు చెప్పేది? అదేదో సూటిగా చెప్తే బావుంటుంది. అమ్మడం ఇష్టం లేకపోతే మీ అయిదెకరాలూ మీరే ఉంచుకోండి. ఆవారా అప్పో సప్పో చేసి తర్వాత తీర్చుకుంటాను" అని లేచి నిల్చున్నాడు.

తండ్రి అతని చెయ్యి పట్టుకుని ఆపాడు. అతను మళ్ళీ కూర్చున్నాడు - ఈసారి అయిష్టంగా.

"బాబు కన్నా పొలం నాకు ముఖ్యమైనది కాదు. అలా ఆలోచించేవాణ్ణయితే కాగితాల మీద సంతకం చేసేవాడిని కాదు. బొంబాయి వెళ్ళడం అనవసరమని నాకనిపిస్తోంది. నీకు రెట్టింపు వయసూ, అనుభవం ఉన్నాయి నాకు. ఎంతోమంది పిల్లల్నీ పెద్దల్నీ చూశాను. ఎన్నో జీవితాల్ని చదివాను. నీ కొడుకు సమస్యేమిటో నేను గ్రహించాను.

"..."

"అందర్నీ వదిలిపెట్టి నువ్వొక్కడివే సుఖపడాలన్న ఆలోచన నీకెలా వచ్చిందో, ఎప్పుడొచ్చిందో నాకు తెలీదు. సుఖమంటే డబ్బుండడం కాదు. డబ్బుతో అన్నీ కొనుక్కోవడం కాదు. ఎన్ని కొనుక్కున్నా ఇంకా కొనాల్సినవి ఉంటూనే ఉంటాయి. కొన్నవి నాకు చాలన్న తృప్తినిచ్చే మనసుండడం మనిషి సుఖానికి మూలం. ఈ సంగతిని పెద్దలు చెప్పనే చెప్పారు. శాస్త్రజ్ఞులు చెప్తేగానీ నమ్మదేమో మీ తరం."

"ఇప్పుడివన్నీ ఎందుకు?"

"బాబు సమస్య దీంతో ముడిపడి ఉంది. ఏ మనిషీ తన దగ్గర సరిపడ్డంత డబ్బుందని ఒప్పుకోడు. ఎంత సంపాదించినా ఇంకా కొరత మిగిలే ఉంటుంది. డబ్బు సంపాదించడం, దాన్ననుభవించడమే సుఖమైతే నీ లెక్కప్రకారం ఈ ప్రపంచంలో నిజంగా సుఖపడ్డవాడు అత్యంత ధనవంతుడవుతాడు. అది తప్పు. మానవ సంబంధాలు సరిగ్గా ఉంటే మనిషి సుఖానికి డబ్బుతో నిమిత్తం లేదు. ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది"

"అంటే మీ ఉద్దేశం? నేను డబ్బు మనిషిననా?"

"అని కాదు. డబ్బుతో పిల్లాడికి సుఖాన్నీ, వైద్యాన్నీ కొనివ్వగలననుకోవడం తప్పని నా భావం. వాడికి సందడి కావాలి. చుట్టూ మనుషులుండాలి. ఉలకనీ పలకనీ టెడ్డీ బేర్లూ, మిక్కీ మౌస్‌లూ కాదు. తోటి పిల్లల్తో ఆటపాటలు కావాలి. జీవం, చైతన్యం ఉట్టిపడే లోకం కావాలి. ఇంకో పిల్లో, పిల్లాడో ఉంటే వాడికింత ఒంటరితనం ఉండదు. ఇప్పుడా అవకాశం లేదా?"

మామగారి మాటలకి భారతి ముఖం ఎర్రబడగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. తిలక్ వెనుకటి ఫోర్సు తగ్గింది గాబట్టి నాన్సెన్సని కొట్టిపారెయ్యలేదు.

"చాలా ఏళ్ళయింది ఆపరేషన్ చేయించుకొని. సాధ్యపడకపోవచ్చు." గొణిగాడు.

"ఎవర్నైనా పెంచుకోండి. ఏం? ఓ ఆడపిల్లని పెంచి పెద్ద చేసి, పెళ్ళి చేసి పంపలేరా మీరు?"

తండ్రి మాట్లాడ్డం ఆపేసినా లేచి వెళ్ళే ప్రయత్నం చెయ్యలేదు తిలక్. తండ్రి

చెప్పినట్టు తన ఆలోచనల్లో ఎక్కడో లోపం ఉంది. విత్తనాన్ని పెట్టి అది మొలకెత్తిందో, లేదోనని పదేపదే తవ్వి చూసుకున్నట్టు ఒక్కపిల్లాణ్ణి కని తన ఆశల ఆరాటంతో వాణ్ణి ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాడు. వాడు స్వతంత్రంగా ఏదీ చెయ్యకుండా కీబొమ్మని చేసి వాడితో తాను ఆడుకుంటున్నాడు. తన తండ్రికి తనతో ఇంత ఎటాచిమెంటుండేది కాదు. పిల్లల విషయాలు తల్లికే వదిలేసేవాడు. ఆవిడ స్వేచ్ఛగా తనని పెంచింది. భారతికి తనలాంటి స్వేచ్ఛని ఇవ్వలేదు. కాసేపాగి తిలక్ తండ్రి మళ్ళీ అన్నాడు. "నా తోబుట్టువుల్ని సరే, నీ తోడబుట్టిన వాళ్ళని కూడా దూరం చేసుకుని ఒంటిపిల్ల రాకాసిలా బతుకుతున్నావు. అమ్మాయిని పుట్టింటికి పంపవు. అందర్నీ దూరం చేసుకుని ఏం సాధించేవు? నీ డబ్బు వాళ్ళంతా తినేస్తారనేగా నీ భయం? నీ చెల్లెళ్ళకి ఏడాదికి నువ్వో చీరా, జాకెట్టూ పెడ్తేనూ, భారతి తన తండ్రి మందులకని ఓ వంద రూపాయలిస్తేనూ తప్పా? వాళ్ళకి లేక కాదురా ఆ ఆశింపు. మనని మరొకరు గుర్తిస్తున్నారు, కనిపెట్టుకుని ఉన్నారన్న తృప్తి కోసం. ఏమీ, అంతగా అవసరమైతే వెయ్యో, అయిదొందలో సర్దలేవా?"

తిలక్ తలొంచుకున్నాడు, తండ్రి తన మనసుని చదివేస్తుంటే.

"బాబు అమ్మ ఒళ్ళోని ఆర్తినీ, అనుభూతినీ పూర్తిగా అనుభవించకముందే అమ్మాయెళ్ళి ఆఫీసులో జాయినైంది. వాడికి రెండేళ్ళు రాగానే కాన్వెంట్లో వేశావు. అక్కడ బితుకుబితుకుమంటూ గడిపి ఇంటికొస్తే గుండెకి హత్తుకుని సేదదీర్చడానికి అమ్మ ఎదురు రాదు. ఆడుకోవడానికి బయటికి వెళ్ళకూడదని ఆంక్ష. ముసలాళ్ళం మేమిద్దరం. వాడి చిన్నిమనసెంత నలిగిపోయి ఉంటుందో ఆలోచించావా? నీ చిన్నప్పుడు నువ్వు మమ్మల్ని ద్వేషించి ఉండవచ్చు. కానీ, తోటిపిల్లల్తో ఆటల్లో పడ్డప్పుడు ఆ ద్వేషాన్ని కాసేపైనా మర్చిపో గలిగావా, లేదా? మరి ఇప్పుడు? నీ బాధని పంచుకోవడానికి ఎవరూ లేరు. నిన్ను నువ్వు ఓదార్చుకోవాలేగానీ ఒక్కరూ నీ సాయానికి రారు. నీ అంతట నువ్వు సేదదీరేంత ధైర్యం నీకుందా? నీకేగాదు, ఏ మనిషికీ ఉండదని నా నమ్మకం."

"వద్దు. ఇంకేమీ చెప్పకండి." సిగ్గేసింది తిలక్కి.

అతనికి చప్పుని గుర్తొచ్చింది- 'డబ్బు' అనేదొకటి ప్రపంచాన్ని శాసిస్తుందనీ, దాన్ని తండ్రి దుర్వినియోగపరచడంచేతనే తనకి దక్కాల్సినవన్నీ దక్కడం లేదని తననుకోకముందు చాలా సంతోషంగా ఉండే వాడినని. ఆ సంతోషపు రోజుల్లో తండ్రి మేనత్తని అతను అమ్మమ్మా అని పిలిచేవాడు. పెద్దమేనత్త ఎనిమిదేళ్ళొచ్చేదాకా అతన్ని చంకనేసుకుని తిరిగేది. అప్పట్లో కాస్తెక్కువ దూరం నడవాల్సొస్తే తండ్రి అతన్ని భుజాలమీద ఎక్కించుకుని తీసుకెళ్ళేవాడు.

ఆకాశంలోని మబ్బులన్నీ తొలగి చంద్రోదయమైనట్టు అతని మనసంతా చల్లటి వెలుతురు పరుచుకుంది. ఆ వెలుతుర్లో డబ్బుని మినహాయించుకున్న ప్రపంచం కూడా శోభాయమానంగానే కనిపించింది. కొడుకు తన తెలివితక్కువతనం, అనుభవరాహిత్యాల వల్ల ఊబిలోకి కూరుకుపోతుంటే తండ్రి చేయూతనిచ్చి పైకి లాగుతున్న దృశ్యం రూపుదిద్దుకుంది. ఆయన పాతకాలం వాడే కావచ్చు, డబ్బు దాచలేకపోవచ్చు, చీకూ చింతా లేకుండా నిశ్చింతగా ఉన్నాడు. ఆయన ఆలోచనల తాలూకూ వేర్లు సృష్టి ఆదిలోకి... మానవ సమాజపు తొలి పునాదుల్లోకి చొచ్చుకుపోయి సృష్టి అంతం దాకా విస్తరించేంత విశాలమైనవి. మనిషి సృష్టించినది డబ్బు. అది జీవితాల్ని శాసిస్తుందనుకోవడం భ్రమ. ఆ భ్రమని సృష్టించి మనిషి తానే సాటి వాడికి అన్యాయం చేస్తున్నాడు. అప్పుడున్నంత చిక్కదనం ఇప్పుడుండకపోవచ్చు. కానీ, మనిషికి మానవ సంబంధాలు చాలా అవసరం అనుకుంటూ లేచాడు. ■

# అసమానతలే అడ్డంకి

## సాంఘిక అవకాశాల విస్తృతీకరణతోనే అసలు సిసలు ఆర్థిక ప్రగతి సాధ్యం



**భారత ఆర్థికాభివృద్ధి సాంఘిక అవకాశాలు**
రచన: జాం ద్రెజ్, అమర్త్య సేన్
అనువాదం: మానేపల్లి
ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్ 20;
పేజీలు: 110. వెల: రూ. 30.

ఎ.ఎ.వి. ప్రసాద్

"జీవితంలో పేదరికం అంటే, ఒక వ్యక్తి జీవన పరిస్థితుల్లోని పేదరికం కాదు, ఆ వ్యక్తి జీవితంలో ఇతర జీవన విధానాలను ఎంచుకునే అవకాశం లేని సంకుచిత పరిస్థితి లేదా అవకాశాల లేమి... తగినంత రాబడి లేకపోవడాన్ని ఆర్థిక పేదరికంగా గుర్తిస్తే-దానికి కారణం అవకాశాల నిరాకరణ, తత్సంబంధమైన దుష్ఫలితాల ప్రభావమే" అనే సూత్రీకరణను పునాదిగా తీసుకొని నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్, ఫ్రెంచ్ ప్రొఫెసర్ జాం ద్రెజ్‌తో కలసి ఆర్థికాభివృద్ధి, సాంఘిక అవకాశాలు గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథాన్ని డాక్టర్ మానేపల్లి ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించారు.

ఆర్థిక వనరులను పెంపొందించడం కన్నా మానవ సామర్థ్యాలను పెంచిపోషించడమే 'అభివృద్ధి' అని సేన్, జాం ద్రెజ్‌లు నిర్వచించారు. పేదరికం అంటే సామర్థ్యాల నిరాకరణ అని పేర్కొంటూ, ఇక్కడ సామర్థ్యం అంటే వ్యక్తిగత సామర్థ్యం కాదనీ, సమాజం వ్యక్తి జీవనోపాధికి ఇచ్చే సామర్థ్యం అనీ వివరించారు. విద్య, ఆరోగ్య సౌకర్యాల పంపిణీలో అందరికీ సమానావకాశాలు మానవ సామర్థ్యాల పెంపునకు దారితీస్తాయి. దక్షిణ కొరియా, తైవాన్, సింగపూర్, మలేసియా వంటి తూర్పు ఆసియా దేశాలు, మరీ ముఖ్యంగా చైనా విద్య, ఆరోగ్యం, భూ సంస్కరణల రంగాల్లో ప్రజలకు సమానావకాశాలు అందివ్వడం వల్లనే, ఈ దేశాలు అద్భుత ఆర్థిక, పారిశ్రామిక ప్రగతి సాధించాయని రచయితలు వివరించారు.

మానవ సామర్థ్యాల పెంపుదలకు సంబంధించి ఇతర దేశాలలో చైనానూ, మన దేశంలో కేరళనూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రతిపాదించారు. నిరక్షరాస్యత, ఆకలి, అనారోగ్యం, ఆర్థిక అభద్రత-వీటిలో దేనిమీదనూ భారతీయ ప్రజానీకం ఆగ్రహించకపోవడం వల్లనే నిరంతర దుఃస్థితి ఏర్పడుతోందని సూచించారు. భారతదేశంలో ఏటా స్థూల జాతీయోత్పత్తి, స్థూల దేశీయోత్పత్తి పెరుగుతూనే ఉన్నా, ప్రజల్లో చైతన్యరాహిత్యం, ప్రభుత్వ అలసత్వం, సాంఘిక అసమానతలు, పౌష్టికాహార లోపం, నిరక్షరాస్యత, అనారోగ్యం, స్త్రీపురుష వివక్ష వంటి లోపాల వల్ల దేశం ఆర్థికంగా ముందడుగు వేయలేకపోతోంది.

1991లో భారతదేశం ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలు చైనా స్థాయిలో విజయవంతం కావాలంటే, పైన చెప్పుకొన్న లోపాలను అధిగమించడం అవసరమని రచయితలు హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్య గురించి సేన్-ద్రెజ్ తులనాత్మక పరిశీలనను గమనించాలి. ప్రాథమిక విద్య విషయంలో ప్రపంచంలోని ఇతర పేద దేశాలకంటే కూడా భారత్ వెనుకబడి ఉందనీ, స్వదేశంలోనే అక్షరాస్యత కేరళలో బాగా ఎక్కువ, ఉత్తరప్రదేశ్‌లో బాగా తక్కువనీ గుర్తుచేశారు. విద్య విషయంలో అసమానతలే దేశ ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి ఫలితాలను అందరికీ అందకుండా చేస్తున్నాయి. పేదవారికి ఎంతోకొంత ఆదాయం తెచ్చిపెట్టే చిన్న చిన్న గడియారాలు, కత్తులు తదితర వస్తువులను తయారు చేయడానికి కావలసిన ప్రాథమిక విద్య చైనా, తూర్పు ఆసియా దేశాల పౌరులకి ఉంది.

ఆ దేశాలు ప్రపంచానికి ఎగుమతి చేస్తున్న వస్తువులివే. ఈ ఎగుమతులు పై దేశాల ఆర్థికాభివృద్ధికి సోపానాలు. వీటిని కాదని సాఫ్ట్‌వేర్ పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేస్తే, ఆ వృద్ధి ఫలాలు మన నిరక్షరాస్యులకు అందవని రచయితలు విశ్లేషించారు. నైపుణ్యం ప్రధానంగా గల ఆధునిక పరిశ్రమల్లో, కనీసం ప్రాథమిక విద్యా వసతి కూడా లేని భారత ప్రజలు ఎలా పాల్గొనగలరు అని ప్రశ్నిస్తారు. చైనా, తూర్పు ఆసియా దేశాల ఆర్థిక విజయాలకు కేవలం సరళీకరణ, స్వేచ్ఛా మార్కెట్లే కారణం అనుకోవడం అర్థరహితమనీ, విద్యా విస్తరణ, ఆరోగ్య సేవలు, భూ సంస్కరణల రంగాల్లో ఆ దేశాల ప్రభుత్వాలు తీసుకొన్న చొరవే విజయ రహస్యమనీ సేన్, ద్రెజ్‌లు ఉద్ఘాటించారు. నిజానికి 1949 ప్రాంతాల్లో భారత్, చైనాలు సరిసమానంగా పేదరికం అనుభవించినా, నేడు చైనా అన్నిరంగాల్లో బాగా అభివృద్ధి సాధించింది. ముఖ్యంగా 1979 నుంచి అక్కడ అమలైన ఆర్థిక సంస్కరణలు చైనాను ఎంతో ముందుకు తీసుకుపోయాయి. సంస్కరణలకు పూర్వకాలంలో సాంఘిక రంగంలో అందరికీ సమానావకాశాలు కల్పించడమే, సంస్కరణల అనంతరం చైనా సాధించిన ఆర్థిక విజయాలకు మూలకారణం.

> **పుస్తకాంశం**
>
> "చర్చ, విమర్శ కేవలం ఆర్థిక సంస్కరణలపై, లాభనష్టాలపై కాక సాంఘిక అసమానతలపై సాగాలనీ, భాగస్వామ్య ఆర్థిక విధానం విస్తరించాలని మేం చెబుతున్నాం."

విద్య, స్త్రీపురుష వివక్ష తొలగింపు, భూసంస్కరణల రంగాల్లో చైనా, తూర్పు ఆసియా దేశాలు, బ్రెజిల్‌ల అనుభవాల నుంచీ, మన దేశంలోనే కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల అనుభవాలనుంచీ పాఠాలు నేర్చుకొంటూ సాంఘిక అసమానతలను తొలగించి, ఆర్థిక సంస్కరణల రంగంలో భారత్ పురోగమించాలనీ, ఆర్థికాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనీ రచయితల ఆకాంక్ష. ■